క్లుప్తంగా

మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ

రాజమహేంద్రవరం రూరల్: ఏపీఎస్‌డీసీ ఆధ్వర్యంలో ధవళేశ్వరంలోని ప్రభుత్వ ఐటీఐలో మహిళలకు టైలరింగ్ శిక్షణ ఇస్తున్నారు. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ ఎల్ఆర్ఆర్ కృష్ణన్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతి, ఆపై అర్హత కలిగిన 15 ఏళ్ల నుంచి 45 ఏళ్ల మధ్య వయసున్న మహిళలు అర్హులన్నారు. ఆసక్తి కలవారు తమ ఆధార్ కార్డు జిరాక్స్, ఫోన్ నంబర్, ఇ-మెయిల్ ఐడీతో కలెక్టరేట్ వెనుక ఉన్న ఐటీఐ కార్యాలయాన్ని పనివేళలో సంప్రదించాలన్నారు. పూర్తి వివరాల కోసం 83285 07473 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న మహిళా సంరక్షణ కార్యదర్శి ప్రియాంక

రాజమహేంద్రవరం రూరల్: పోక్సో చట్టంపై కిశోర బాలికలు అవగాహన పెంచుకోవాలని మహిళా సంరక్షణ కార్యదర్శి ప్రియాంక అన్నారు. బొమ్మూరు గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం కిశోర వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ కిశోర బాలికలకు నెల రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నరుకుల మేరీ, మాధవి, వెంకటలక్ష్మి, కిశోర బాలికలు పాల్గొన్నారు.

పిల్లలకు వైద్యసేవలు



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఇన్నీసుపేట శాఖా గ్రంథాలయంలో రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. పుస్తక పఠనం, నీతికథలు చెప్పడం, తెలుగు పద్యాలు, చిత్రలేఖనం, సంగీతం తరగతులు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు శ్రీసాయిరామ్ డెంటల్ హాస్పిటల్ వైద్యుడు డాక్టర్ ఎం.రామ్‌కుమార్ దంత పరీక్షలు, మాక్స్ విజన్ ఐ హాస్పిటల్ వైద్యులు కంటి పరీక్షలు జరిపారు. చిన్న పిల్లల వైద్యనిపుణులు హారికా ప్రియంవద విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

వ్యాధులపై ప్రజలకు అవగాహన

సీటీఆర్ఐ: వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వీధి నాటకం (కళాజాత) ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు డిస్ట్రిక్ట్ ఎయిడ్స్ ప్రివెన్షల్ కంట్రోల్ యూనిట్ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ పి.బాలజీ అన్నారు. దీనిలో భాగంగా మంగళవారం గోకవరం బస్టాండ్, పుష్కర ఘాట్ వద్ద జాతీయ ఎయిడ్స్ నియంత్రణలో భాగంగా ఎయిడ్స్ నివారణ, దిశ నియంత్రణ వ్యవస్థ సంయుక్త ఆధ్వర్యంలో వీధి నాటకాలను ప్రదర్శించామన్నారు. కార్యక్రమంలో బుజ్జిబాబు, చేంజెస్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధమైన పఠనంతో విజయం తథ్యం



సదస్సులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు

కంబాలచెరువు: ప్రణాళికాబద్ధమైన పఠనంతో డీఎస్సీలో విజయం సాధించవచ్చని పోటీ పరీక్షల కోచింగ్ నిపుణుడు, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. స్థానిక ఆనం కళా కేంద్రంలో యూటీఎఫ్, డీవైఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం డీఎస్సీ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదివే ప్రతి విషయాన్ని అవగాహనతో అర్థం చేసుకోవాలన్నారు. గతంలో జరిగిన ప్రశ్నాపత్రాల మోడళ్లను చూసుకోవాలన్నారు. అకడమిక్ పరీక్షలకు, కాంపిటేటివ్ పరీక్షలకు చాలా వ్యత్యాసం ఉంటుందన్నారు. దాన్ని దృష్టిలో ఉంచుకొని డీఎస్సీ పరీక్షలకు అభ్యర్థులు సన్నద్ధం కావాలన్నారు. ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలన్నారు. ఈ సందర్భంగా అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేశారు. లక్ష్మణరావు పత్రికల్లో రాసిన వ్యాసాల సంకలనం 'సమకాలీన వ్యాసాలు' పుస్తకాన్ని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.అరుణ కుమారి ఆవిష్కరించారు. అనంతరం టెట్, డీఎస్సీ అభ్యర్థులకు లక్ష్మణరావు రాసిన విద్యా మనోవిజ్ఞాన శాస్త్రం స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఏ.షరీఫ్, ఉపాధ్యక్షులు కె.విజయ్ గౌరీ, కోశాధికారి ఈవీఎస్ఆర్.ప్రసాద్, డీవైఎఫ్ఐ బాధ్యులు రాంబాబు పాల్గొన్నారు.

తీయని విషం!

- మామిడి కాయలు పండించటానికి రసాయనాల వినియోగం
- అసహజ పద్ధతులు పాటిస్తున్న కొందరు వ్యాపారులు
- అవి తింటే అనారోగ్యాలు

రాజమహేంద్రవరం రూరల్: మామిడి పండ్ల వ్యాపారం రాజమహేంద్రవరం నగరం, పరిసర ప్రాంతాలలో జోరుగా సాగుతోంది. ఎండాకాలంలో నోరూరించే ఈ పండ్లను కొనుగోలు చేసేందుకు జనం ఆసక్తి చూపుతారు. సీజన్ వారీగా దొరికే వీటిని ఇష్టపడని వారుండరంటే అతిశయోక్తి కాదు. సహజంగా ముగ్గిన పండ్లు ఎంతో రుచిగా ఉంటాయి. అయితే కొందరు వ్యాపారాలు రసాయనాలతో మామిడి కాయలను కృత్రిమంగా మగ్గబెడుతున్నారు. ఎక్కువ లాభాలను ఆర్జించాలనే దురుద్దేశంతో వీరు చేసే పని వల్ల మధుర ఫలం విషతుల్యమవుతుంది. రాజమహేంద్రవరం నగరం, పరిసర ప్రాంతాలలో కొన్నిచోట్ల కాల్షియం కార్బైడ్‌తో మగ్గబెట్టిన మామిడి పండ్లను విక్రయిస్తున్నారు. ఈ కృత్రిమ పద్ధతుల్లో పండించిన మామిడి పండ్లు పసుపు రంగులో నిగనిగలాడుతూ కనిపిస్తాయి. వీటిని కొనుగోలు చేసి తింటున్న ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు.

విషతుల్యం

గతంలో పండ్లను సాధారణ పద్ధతుల్లో మగ్గబెట్టేవారు. జనాభా పెరుగుదల, పండ్ల వినియోగం పెరగడంతో కృత్రిమ పద్ధతులను పాటిస్తున్నారు. ఇలా ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. కాల్షియం కార్బైడ్ వినియోగం వల్ల జీర్ణకోశ వ్యాధులు సంభవించే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మామిడి సహా నేడు మార్కెట్లో దొరికే అరటి తదితర పండ్లను కృత్రిమంగానే మగ్గబెడుతున్నారు. ఈ అనర్థాలపై ఆహార భద్రతా నియంత్రణ అధికారులు రైతులకు, వ్యాపారులకు సదస్సులు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నారు.

నిగారింపు

రసాయనాల మగ్గబెట్టిన మామిడి పండ్లు 24 గంటల్లోనే పండిపోతుంది. చక్కని పసుపు రంగుతో నిగనిగలాడుతుంది. సాధారణంగా మామిడికాయలను చెట్టు పైనే పక్వానికి వచ్చే వరకు ఉంచితే సహజ సిద్ధంగా తీపిగా ఉంటాయి. కానీ వ్యాపారులు పక్వానికి రాకుండానే పచ్చి కాయలను తోటల నుంచి మార్కెట్‌కు తీసుకువస్తున్నారు. కాల్షియం కార్బైడ్‌ను వినియోగించి కాయలను 18 నుంచి 24 గంటల్లో పక్వానికి వచ్చేలా చేస్తున్నారు. అరటి, సపోటా, బొప్పాయి వంటి పండ్లను కూడా రసాయనాలతో మగ్గబెడుతున్నారు.

గుర్తించండి ఇలా..

- మామిడి, అరటి పండ్లను మగ్గబెట్టడానికి వ్యాపారులు ఎక్కువగా రసాయనాలను వినియోగిస్తున్నారు. కార్బైడ్, ఇథిలీన్‌తో మగ్గబెట్టిన పండ్లను గుర్తించడానికి నిపుణులు పలు సూచనలు చేస్తున్నారు.
- ఈ పండ్లు ఎక్కువ పసుపు వర్ణంలో ఉంటాయి. వీటిని తినేటప్పుడు నోటిలో కొంచెం మంట, కడుపులో నొప్పి, గొంతు నొప్పి మొదలవుతుంది.
- కృత్రిమంగా పండే పండ్లు పైకి పండినట్లు కనిపించినా లోపల రుచిలో తేడా ఉండి చప్పగా, పుల్లగా ఉంటాయి.
- సహజంగా పండే పండ్ల నుంచి వచ్చే వాసన బట్టి వాటిని గుర్తించవచ్చు. కృత్రిమంగా పండిన పండ్ల నుంచి వాసన ఏమాత్రం రాదు.
- పండ్లను తిన్న తర్వాత డయేరియా సమస్యకు గురైతే కాల్షియం కార్బైడ్, ఇథిలీన్ వాడినట్లు గుర్తించాలి.
- సహజ సిద్ధంగా మగ్గిన పండ్లపై ఆకుపచ్చ, పసుపు రంగు కనీకనిపించినట్టుగా ఉంటుంది. పండును కోసినప్పుడు లోపల గుజ్జు ఎరుపు, పసుపు రంగు కలిపినట్లు ఉంటుంది. ఈ పండ్లలో రసం ఎక్కువగా ఉంటుంది.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న మామిడి పండ్లు



మార్కెట్ కమిటీలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు (ఫైల్)

అవగాహన కల్పిస్తున్నాం

రసాయనాలు వాడి పండ్లకు మగ్గబెట్టడం వల్ల కలిగే అనర్థాలపై మామిడి రైతులకు, వ్యాపారులకు, వినియోగదారులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. ఎప్పటికప్పుడు తనిఖీలు చేపడుతున్నాం. ఇప్పటికే మార్కెట్ యార్డులో ఇద్దరు వ్యాపారుల నుంచి నమూనాలను ల్యాబ్‌కు పంపించాం. మగ్గబెట్టిన మామిడిపండ్లు అని తేలితే రూ.5 లక్షలు నుంచి రూ.10 లక్షలు జరిమానాతో పాటు, వ్యాపారుల లైసెన్సు రద్దు చేయడం జరుగుతుంది.

– వి.రుక్కయ్య, ఆహార భద్రతా నియంత్రణ అధికారి, రాజమహేంద్రవరం

'సింగిల్' చిత్ర బృందం విజయోత్సవ యాత్ర



అప్సర థియేటర్‌లో ప్రేక్షకులతో మాట్లాడుతున్న శ్రీవిష్ణు, కేతిక శర్మ, ఇవానా, వెన్నెల కిశోర్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): శ్రీవిష్ణు హీరోగా నటించిన సింగిల్ సినిమా విజయవంతంగా ప్రదర్శితమవుతున్న నేపథ్యంలో ఆ చిత్ర బృందం విజయోత్సవ యాత్ర నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా మంగళవారం రాజమహేంద్రవరంలో ఆ సినిమా ప్రదర్శిస్తున్న అప్సర థియేటర్‌కు విచ్చేసింది. శ్రీవిష్ణు, కేతిక శర్మ, ఇవానా, వెన్నెల కిశోర్, దర్శకుడు కార్తిక్ రాజా సందడి చేశారు. డప్పు వాయిద్యాల మధ్య గీత ఫిలిమ్స్ మేనేజర్ వెంకటేశ్వరరావు, అప్సర థియేటర్ మేనేజర్ మధు తదితరులు స్వాగతం పలికారు. థియేటర్‌లోకి చిత్ర బృందం అడుగుపెట్టిన వెంటనే ప్రేక్షకులు కేరింతలు కొట్టారు. ఈ నెల 9వ తేదీన విడుదలైన సింగిల్ సినిమాను ప్రేక్షకులు బాగా ఆదరిస్తున్నారని శ్రీవిష్ణు పేర్కొంటూ కృతజ్ఞతలు తెలిపారు. వెన్నెల కిశోర్ ప్రేయసి పాత్ర గాయత్రి గురించి సినిమాలో పలుసార్లు హీరో శ్రీవిష్ణు ప్రస్తావించడం నవ్వులు పోయించింది. అదే విషయాన్ని ప్రేక్షకులు గుర్తుచేసుకుంటూ గాయత్రి రాలేదా అంటూ ప్రశ్నించారు. కేతిక శర్మ, ఇవానా మాట్లాడుతూ చిత్రాన్ని బాగా ఆదరిస్తున్నందుకు ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు.

క్వారీ గోతులను తక్షణమే పూడ్చాలి

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని రామదాసుపేట, సుబ్బారావు నగర్ ప్రాంతాలలో మెటల్ కోసం తవ్విన క్వారీలలో ఏర్పడిన గోతులను తక్షణమే పూడ్చేందుకు సమన్వయశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆర్ఎంసీ, మైన్స్, ఆర్అండ్‌బీ తదితర సమన్వయ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రామదాసుపేట, సుబ్బారావు నగర్‌లోని మెటీరీలాజికల్ బెల్టులో మూడు దశాబ్దాలుగా రోడ్డు మెటల్ క్వారీలు నిర్వహిస్తున్నార న్నారు. క్వారీ లీజు పొందిన 51 సంస్థలు మెటల్ తవ్విన అనంతరం క్వారీని మట్టితో పూడ్చాలి అనే నిబంధనను పాటించలేదన్నారు. దీంతో ఆ క్వారీల వల్ల సమీప ప్రాంతాల్లో నివసించే ప్రజలు వినియోగించే రహదారి ప్రమాదకరంగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో ఆ రహదారిలో అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదాలు సంభవించకుండా జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. రెండున్నర కిలోమీటర్ల మేర రహదారిని నిర్మించి, దానికి ఫెన్సింగ్ వేయడంతో పాటు లైటింగ్, సైన్‌బోర్డులు, సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేయాలన్నారు. ఆ రోడ్డు నిర్మాణం పూర్తయ్యేలోపు ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం 22ఏ కింద ఉన్న భూముల క్రమబద్ధీకరణపై చర్చించారు. రాజేంద్ర నగర్, సుబ్బారావుపేట, నెహ్రూనగర్, బర్మా కాలనీ, బత్తిన నగర్, సంజీవయ్య నగర్, సింహాచలనగర్, రామదాసుపేట, ఆనంద నగర్‌లోని 22ఏ భూముల క్రమబద్ధీకరణ వివరాలను తెలియజేయాలని ఆదేశించారు.



క్యాంపు కార్యాలయంలో అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

పారదర్శకంగా వీధి విక్రయదారుల సర్వే

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో వీధి విక్రయదారుల సర్వేను వారం రోజుల్లో పూర్తి చేయాలని అడిషినల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ సూచించారు. ఈ మేరకు మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీలు, మెప్మా సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ మాట్లాడుతూ వీధి విక్రయదారుల ఉపాధికి భద్రత కల్పించేందుకు, సబ్సిడీపై రుణాలు ఇప్పించడానికి ఈ సర్వే దోహదపడుతుందన్నారు. సర్వేలో భాగంగా నగరంలోని వీధి వ్యాపారులను సచివాలయాల వారీగా గుర్తించడం జరుగుతుందన్నారు. అనంతరం వారికి జోన్లు కేటాయించి గుర్తింపు కార్డులు, వెండింగ్ సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. అలాగే పీఎం స్వానిధి పథకం ద్వారా వీరందరికీ రూ.10 వేలు, రూ.20 వేలు, రూ.50 వేల చొప్పున బ్యాంకు రుణాలు ఇప్పిస్తామన్నారు. సర్వేను అత్యంత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. సర్వేలో వీధి వ్యాపారి ఆధార్, ఫోన్ నెంబర్, వ్యాపారం చేసే స్థలం వివరాలు సమగ్రంగా సేకరించాలన్నారు. సర్వే పూర్తి అయ్యాక నివేదిక ప్రకారం నగరంలో వెండింగ్ జోన్లు ఏర్పాటు చేసి, ఆయా జోన్లలో వీధి వ్యాపారులకు మార్కింగ్ ఇస్తామన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో వీధి వ్యాపారులు ఎదుర్కొనే సమస్యలపై ఆయా సంఘాల ప్రతినిధులు, వెండింగ్ కమిటీ ప్రతినిధులు తమ దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. సమావేశంలో సీఎంఎం రామలక్ష్మి, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీలు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కమిషనర్ రామలింగేశ్వర్

అమ్మ ఉత్సవం.. వైభవోపేతం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



గరగ నృత్యాలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): 19వ డివిజన్‌లో కన్నమాంబ పేరంటాలమ్మ జాతరోత్సవం మంగళవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఘటాలను వీలలథులలో ఊరేగించారు. కేరళ వాయిద్యాలు, శక్తి వేషధారణలు, డీజే డ్యాన్సులు, గరగ నృత్యాలు, బాణసంచా కాల్పులు ఆకట్టుకున్నాయి. చివరగా ఘటాలను ఆలయానికి తీసుకురావడంతో ఉత్సవం ముగిసింది.



కన్నమాంబ పేరంటాలమ్మ ఘటాలను ఊరేగిస్తున్న దృశ్యం

గుర్తు తెలియని వ్యక్తుల మృతి

కంబాలచెరువు: నగరంలోని రెండు ప్రాంతాల్లో మంగళవారం ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మృతి చెందారు. జాంపేట పరిసర ప్రాంతాల్లో తిరుగుతూ చిన్న చిన్న హోటళ్లలో పనిచేసుకునే ఓ వ్యక్తి (సుమారు 40 ఏళ్లు) పాత సోమాలమ్మ గుడి ప్రాంతంలో చనిపోయాడు. అతడి ఆచూకీ తెలిసిన వారు త్రీటౌన్ సీఐ 94407 96532, ఎస్సై 99897 86529 నంబర్లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. ఆ మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీలో భద్రపరిచారు.

ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద..

ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి (43) అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని స్థానికులు గమనించి, 108కు సమాచారం ఇచ్చారు. అతడిని అంబులెన్స్‌లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కానీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అతడి ఆచూకీ తెలిసిన వారు ప్రకాశం నగర్ సీఐ 94407 96582, ఎస్సై 90102 61603లకు సమాచారం ఇవ్వాలని కోరారు.





అభివృద్ధిని చూసి ఓర్వలేకే ఆరోపణలు

- భరత్‌రామ్‌పై అసత్య ప్రచారం సరికాదు
- కూటమి నాయకుల తీరు దారుణం
- వైఎస్సార్ సీపీ నేతల ధ్వజం



పాకిస్తాన్ యుద్ధంలో వీరమరణం పొందిన మురళీ నాయక్‌కు సెల్యూట్ చేస్తున్న సాగర్, హసన్ తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: మాజీ ఎంపీ భరత్ రామ్ గత ఐదేళ్లలో రాజమహేంద్రవరాన్ని ఎంతో సుందరగా తీర్చిదిద్దారని, అది చూసి ఓర్వలేక ఆయనపై సిటీ ఎమ్మెల్యే అనుచరులు అసత్యాలు ప్రచారం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ పార్లమెంట్ అధికార ప్రతినిధి కానుబోయిన సాగర్, వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రీజినల్ కో ఆర్డినేటర్ షేక్ హసన్, నగర లీగల్ సెల్ అధ్యక్షుడు పులగం రామలింగారెడ్డి ధ్వజమెత్తారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గడిచిన పది నెలలుగా నగరం ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని ధ్వజమెత్తారు. భరత్ రామ్‌పై ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో వాస్తవాలు లేవని, అవన్నీ అసత్యాలేనన్నారు. ప్రభుత్వం మీ చేతుల్లో ఉన్నప్పుడు హైకోర్టు జడ్జి చేతనైనా విచారణ చేయించవచ్చు కదా అని ప్రశ్నించారు. సవాళ్లను ఎదుర్కొవడానికి భరత్‌రామ్ ఎప్పుడూ సిద్ధమేనన్నారు. ఎన్ని కేసులైనా పెట్టుకోండి, ఏ విచారణకైనా సిద్ధమని ఆయన ఇప్పటికే ప్రకటించారన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో భరత్ ఎలాంటి సీఎంఆర్ఎఫ్ నిధులు ఇవ్వలేదని తెలుగుదేశం నాయకులు అసత్య ప్రచారం చేయడం దారుణమన్నారు.

స్పా సెంటర్లపై విచారణ జరపాలి

షేక్ హసన్ మాట్లాడుతూ స్పా సెంటర్ల మీద విచారణ జరిపించాలని తాము కూడా ఎస్పీకి ఫిర్యాదు చేస్తామన్నారు. నగరంలో గతంలో ఎన్ని స్పాసెంటర్లు ఉన్నాయి, ఇప్పుడు కొత్తగా ఎన్ని వచ్చాయి, అవి ఎలా నడుస్తున్నాయో తేల్చాలని కోరతామన్నారు. రాజమహేంద్రవరం అంటే భరత్ రామ్, భరత్ రామ్ అంటే రాజమహేంద్రవరం అనే విధంగా ఒక ఐకాన్ గా నిలిచారన్నారు. ఆయన చేసిన మంచి పనులను చూసి ఓర్వలేక కూటమి నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక జరుగుతున్న ఇసుక, మద్యం అక్రమాలపై భరత్ రామ్ పోరాటం చేస్తున్నారన్నారు. అనంతరం భారత్ – పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో వీర మరణం పొందిన మురళీ నాయక్ చిత్రపటానికి నివాళులర్పించారు. సమావేశంలో కార్యక్రమంలో ఎంఏఏ బాషా, సురేష్, మార్తి నాగేశ్వరరావు, నందం స్వామి, గారా చంటి, రేగుల శ్రీధర్, ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా పటిష్ట చర్యలు చేపట్టినట్లు కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. ఆయన మంగళవారం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి నగరంలో పర్యటించారు. వెంకటేశ్వరనగర్‌లోని 1000 కేఎల్ కెపాసిటీ వాటర్ ట్యాంకు నిర్మాణాన్ని పరిశీలించారు. నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం పుష్కర ఘాట్ వద్ద హెడ్ వాటర్ వర్క్స్ పనులను పరిశీలించారు. వాటర్ పైపులైన్లలో గుర్తించిన లీకేజీలకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలన్నారు. అనంతరం 19, 25 వార్డులలో పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆయన వెంట ఎస్ఈ కోటేశ్వరరావు, ఈఈ మాధవి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

హెచ్‌ఐవీపై జానపద కళాజాత

కంబాలచెరువు: జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై జానపద కళాజాతను మంగళవారం జిల్లా కుష్ఠు, ఎయిడ్స్, క్షయ అధికారి డాక్టర్ ఎన్.వసుంధర ప్రారంభించారు. స్థానిక వాంబే కాలనీలోని పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ జిల్లాను హెచ్ఐవీ, ఎయిడ్స్ రహితంగా చేయాలనే లక్ష్యంతో జానపద కళజాత ప్రచార కార్యక్రమం ద్వారా ప్రజల్లో అవగాహన కలిగించడానికి ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లాలోని 20 ముఖ్యమైన ప్రాంతాలలో ఈ నెల 23 వరకూ ఏపీ సాక్స్ వారితో శిక్షణ పొందిన రెండు కళజాత బృందాలు వీధి నాటికలు ప్రదర్శిస్తాయన్నారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ వచ్చే విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సుఖ వ్యాధుల నివారణ మార్గాలు తదితర విషయాలను వివరిస్తారన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ పి.బాలాజీ, జిల్లా సూపర్‌వైజర్ ఏ.బుజ్జిబాబు, వైద్యాధికారి డాక్టర్ జ్యోతికిరణ్, జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమ సిబ్బంది పాల్గొన్నారు.




కళాజాతను ప్రారంభిస్తున్న డాక్టర్ వసుంధర

ఉపాధి టీఏలను కొనసాగించాలి

కడియం: ఉపాధి హామీ పథకంలోని టెక్నికల్ అసిస్టెంట్ (టీఏ)లను మండల పరిషత్‌లోనే కొనసాగించాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. పంచాయతీరాజ్‌శాఖ పరిధిలో టీఏలుగా ఉన్న వీరిని ఇటీవల జిల్లా డ్వాక్రాకు బదిలీ చేశారు. దీనివల్ల గ్రామ పంచాయతీల్లో జరగాల్సిన పనులు పెండింగ్‌లో పడుతున్నాయన్నారు. మండల స్థాయిలో టెక్నికల్ అసిస్టెంట్లు పనులను పర్యవేక్షించేవారన్నారు. ఇప్పుడు వారిని బదిలీ చేయడం వల్ల ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయని స్టాలిన్ పేర్కొన్నారు. అలాగే మండల ఇంజినీరింగ్ అధికారిగా పూర్తిస్థాయి బాధ్యతలతో ఎవరినీ నియమించకపోవడం వల్ల కూడా పనులు కావడం లేదన్నారు. దీనిపై కలెక్టర్ వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా స్టాలిన్ కోరారు.

మహాలక్ష్మి అమ్మవారికి పూజలు

కడియం: కడియపులంకలోని మహాలక్ష్మి అమ్మవారిని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కిరణ్మయి మంగళవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఆమెకు గ్రామ ఇన్‌చార్జి సర్పంచ్ పాటంశెట్టి రాంజీ ఘనంగా స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదాశీర్వచనంతో తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పంతం గణపతి, స్థానిక నాయకులు బోడపాటి రాజేశ్వరి, మల్లు బాబీ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న జస్టిస్ కిరణ్మయి

సత్యసాయి గురుకులం విద్యార్థుల ప్రతిభ

రాజమహేంద్రవరం రూరల్: సీబీఎస్ఈ మంగళవారం ప్రకటించిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో రాజమహేంద్రవరంలోని సత్యసాయి గురుకులం విద్యార్థులు నూరు శాతం ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. ఈ మేరకు గురుకులం కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ ఏ.శ్యాం సుందర్, కె.గుర్రయ్య సంయుక్తంగా ప్రకటన విడుదల చేశారు. తమ పాఠశాల నుంచి 35 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 24 మంది డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణత సాధించారన్నారు. ఆయుష్ కుమార్ 92.20 శాతం మార్కులతో ప్రథమస్థానంలో నిలిచాడన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల బృందానికి, విద్యార్థులకు అభినందనలు తెలిపారు.